# కంద

మన రాష్ట్రంలో కంద తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా మరియు గుంటూరు జిల్లాల్లో అత్యధికంగా సాగు చేయబడుతున్నది.

**నేలలు – నేల తయారి :** నీటి వసతి కలిగి మరియు నీరు బయటకు పోవు సదుపాయం గల సారవంతమైన నేలలు అనుకూలం. వేసవిలో భూమిని 30-40 సెం.మీ. లోతుగా దుక్కిదున్నాలి. తొలకరి వర్షాలకు 2 లేక 3 సార్లు మెత్తగా దుక్కిచేయాలి. ఎకరాకు 10 టన్నుల చివికినే పశువుల ఎరువు మరియు 24 కిలోల భాస్వరం యిచ్చు ఎరువును సూపర్ ఫాస్ఫేట్ రూపంలో ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నాలి.

**నాటే సమయం :** మే-జూన్ నెలల్లో నాటిన ఎడల పైరు అధిక దిగుబడినిస్తుంది. ఉభయ గోదావరి జిల్లాల్లో నవంబరు, డిసెంబరు నెలల్లో కూడ నాటవచ్చు.

**రకం : గజేంద్ర :** భారతదేశంలోనే అత్యధిక దిగుబడినిచ్చే రకం. కాలపరిమితి 6-8 నెలలు. దిగుబడి 26-28 ట/ ఎకరాకు.

**విత్తనోత్పత్తి :** ఒక ఎకరాకు కావలసిన విత్తన దుంపలను కేవలం 25 సెంట్ల విస్తీర్ణంలో ఉత్పత్తి చేసుకోవచ్చు. చీడపీడలు లేని ఆరోగ్యవంతమైన షుమారు 100గ్రాముల బరువు గల దుంపలను విత్తనంగా వాడాలి. విత్తన దుంపలను వరుసల మధ్య 45 సెం.మీ. వరుసలలో మొక్కల మధ్య 30 సెం.మీ. దూరం పాటించి నాటాలి. ఆలా నాటినప్పుడు 450 నుండి 700గ్రాముల బరువు గల విత్తిన దుంపలను పొందవచ్చు. కోసిన ముక్కల కన్నా, పూర్తి దుంపలను విత్తనంగా వాడి ఎక్కువ దిగుబడి సాధించవచ్చు.

**విత్తన దుంపలను నిల్వచేసుకోవల్సిన పద్ధతులు :** విత్తన దుంపలు తవ్విన తర్వాత వాటికి కనీసం రెండు నెలలు నిద్రావస్థ వుంటుంది. ఆ సమయంలో అవి కుళ్ళి పోకుండా వుండటానికి, తవ్విన నాలుగు లేక ఐదు రోజుల తర్వాత దుంపలపై శిలీంద్ర నాశనమందులైన కాపర్ఆక్సీక్లోరైడ్ 30గ్రా. స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 1గ్రాము, 10 లీటర్ల నీటిలో కలిపిన మందు ద్రావణాన్ని దుంపలపై పూర్తిగా తడిచేలా పిచికారి చేసి నీడన ఆరపెట్టాలి. అలా ఆరబెట్టిన దుంపలను గాలి, వెలుతురు వుండే పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి.

**విత్తనం :** నీడలో 2-3 నెలలు బాగా ఆరిన దుంపలనే విత్తనంగా వాడాలి. 500-750గ్రా. బరువు కలిగిన దుంపలనే విత్తనంగా వాడాలి. పెద్ద దుంపలను ముక్కలుగా కోసి వాడాలి. ముక్కలుగా కోసేటపుడు దుంప కన్ను (మొలక భాగం) ప్రతి ముక్కలోకి వచ్చే విధంగా కోయాలి. కోసిన విత్తనపు దుంపలను నిల్వ చేయకుండ వెంటనే నాటాలి. ఎకరాకు 6.0 టన్నుల విత్తనం వాడాలి.

**నాటటం :** విత్తన దుంపలను 60×60 సెం.మ.ఈ దూరంలో నాటాలి. విత్తన దుంపలను భూమికి 2-2 1/2 అంగుళాలలోతుగా నాటాలి. విత్తన దుంపలు నాటిన వెంటనే తడియివ్వాలి.

**ఎరువులు :** ఎకరాకు 10 టన్నుల చివికిన పశువుల ఎరువు, 100:24:100 కిలోల నత్రజని, భాస్వరం మరియు పొటాష్ యిచ్చు ఎరువులు వేయాలి. పశువుల ఎరువు మరియు భాస్వరపు ఎరువును సింగిల్ సూపర్‌ఫాస్ఫేటు (150 కి.గ్రా॥) రూపంలో పూర్తిగా ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. నత్రజని, పొటాష్ ఎరువులను యూరియ (217 కి.గ్రా॥), మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (179 కి.గ్రా॥) రూపంలో 3 సమభాగాలుగా చేసి కంద మొలకెత్తిన 40, 80, 120 రోజులకు వేయాలి. యూరియ, పొటాష్ ఎరువులను మొక్కలకు రెండువైపుల గుంటల్లో వేసి మట్టితో కప్పాలి. ఎరువులు వేసిన వెంటనే తేలికపాటి తడియివ్వాలి.

**నీటియాజమాన్యం :** విత్తన దుంపలు నాటిన వెంటనే తగిపెట్టాలి. కాలమాన పరిస్థితులను గమనించి 6-10 రోజుల తేడాతో నీటి తడులు పెట్టాలి. వేసవిలో ప్రతి 4-5 రోజులకు తడియివ్వాలి. (నవంబరు, డిసెంబరు నెలల్లో నాటిన పైరుకు) ఎరువులు వేసిన ప్రతిసారి తేలికపాటి తడియివ్వాలి.

**కలుపు యాజమాన్యం :** కందలో అంతరకృషి చేయటానికి అవకాశంలేదు. కందను బలమైన నేలల్లో వేయటం వలన, అధిక తడులు అవసరమైనందున కలుపు ఎక్కువగా పెరగటానికి అవకాశం ఉంది. కలుపు తక్కువగా ఉన్నపుడు కూలీలతో తీయించటం మంచిది. కలుపు ఎక్కువగా వచ్చే భూముల్లో, మొదటి దఫా తడియిచ్చిన తర్వాత, తడిగా ఉన్న భూమిపై, ఎకరాకు 2.0 లీ. బుటాక్లోర్ లేదా ఒక లీటరు పెండిమిథాలిన్ 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి. పొడిగా ఉన్న భూమిపై చల్లిన మందులు ఫలితమివ్వవు. 40-45 రోజుల తర్వాత పలుచగా మొలిచిన కలుపును, కూలీలతో తీయించాలి. కలుపు తీసిన వెంటనే తడిగా ఉన్న భూమిపై, ముందుగా చల్లిన మోతాదులో సగం మందును మాత్రమే రెండవసారి పిచికారి చేసి కలుపును అరికట్టవచ్చు.

**అంతరసేద్యం :** బాగా ఆరిన దుంపలు నాటిన 20-25 రోజులకు మొలకెత్తుతాయి. పై సందర్భంలో అంతరసేద్యం చేయటానికి వీలుకాదు. దుంపలు మొలకెత్తటానికి ఎక్కువ సమయం పట్టే సందర్భంలో, తక్కువ కాలపరిమితి కలిగిన నువ్వు, మినుము, మొదలైన పంటలను ఆయా ప్రాంతాలకు, కాలానికి తగిన విధంగా ఎంపిక చేసి సాగుచేసుకోవాలి.

నీటితడులు సరిగా లేనప్పుడు ఇనుపధాతు లోపం కనిపిస్తుంది. దీని వలన ఆకులు పత్రహరితం కోల్పోయి తెలుపుగా మారుతాయి. ఈ లోపాన్ని సవరించడానికి లీటరు నీటికి 5 గ్రాముల అన్నభేది, 1 గ్రా. నిమ్మ ఉప్పు కలిపి వారం రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారి చేయాలి.

**ధాతులోపములు :**

**ఇనుపధాతు లోపం :** నీటి తడులు సరిపడగ లేనప్పుడు ఇనుప ధాతులోపం సహజంగా కనిపిస్తుంది. ఆకులు పత్రహరితంను కోల్పోయి తెలుపుగా మారును. ఈ ధాతులోపాన్ని సవరించటానికి లీటరు నీటికి 5 గ్రా॥ అన్నభేది 1 గ్రాము నిమ్మ ఉప్పు ఉండే మోతాదులోకలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. అవసరాన్ని బట్టి నీటి తడులు పెడుతూ నీటి ఎద్దడి కలుగకుండా చేసినట్లయితే ఇనుపధాతు లోపాన్ని నివారించవచ్చు.

**జింకుధాతు లోపం :** ఆకుల ఈనెల మధ్య పసుపు వర్ణంగా మారి, క్రమేపి ఆకు మొత్తం పండి, ఎండి పోవును. ఈ లోపాన్ని సవరించటానికి లీటరు నీటికి 3 గ్రా॥ చొప్పున జింక్ సల్ఫేట్ కలిపి 7-10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

## సస్యరక్షణ

**ఆకుమచ్చ తెగులు :** వర్షాకాలంలో ఆకులపై చిన్న మచ్చలుగా ప్రారంభమై త్వరగా ఎదిగి, ఆకులు పండి, ఎండిపోయి దిగుబడులు బాగా తగ్గిపోతాయి. దీని నివారణకు వర్షాలు ప్రారంభమైన తర్వాత, పైరును గమనిస్తూ తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే లీటరు నీటికి 3 గ్రా. చొప్పున కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును పిచికారి చేయాలి. తెగులు ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 2 గ్రా॥ల మెటలాక్సిల్ ఎమ్.జడ్. మందును ఆకులు అన్ని పూర్తిగా తడిసేలా ఒకసారి మాత్రమే పిచికారి చేయాలి. దుంప త్రవ్వకానికి కనీసం రెండు నెలల ముందు నుండి మందును వాడరాదు.

**కాండం లేక మొదలు కుళ్ళు తెగులు :** కాండం మొదలు వద్ద ఆశించి, కాండం పూర్తిగ కుళ్ళి చనిపోతుంది. దీని నివారణకు మురుగునీరు, వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్త పడాలి. పంట మార్పిడి చేయాలి. తెగులు ఆశించిన చెట్టు చుట్టూ మట్టిని గట్టుగా చేసి, తడిపెట్టినపుడు, నీటిద్వారా ఇతర మొక్కలకు వ్యాపించకుండా అరికట్టాలి. తెగులు ఆశించిన చెట్టు మొదలు చుట్టూ వున్న మట్టిని లీటరు నీటికి 1 గ్రాము కార్బండైజిమ్ (లేక) 2 గ్రా. కాప్టాన్ లేక 3 గ్రా॥ కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును కలిపిన ద్రావణంతో బాగా తగిపి తెగులును అరికట్టవచ్చు. ట్రైకోడెర్మా శిలీంధ్ర బీజాలు కలిగిన పొడిని వేపపిండితో కలిపి మొక్కల మొదళ్ళవద్ద వేయాలి.

**మొజాయిక్ తెగులు :** తెగులు ఆశించిన మొక్కల ఆకులు పత్రహరితాన్ని కోల్పోయి, తెలుపు, పసుపురంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు చిన్నవిగాను, ముడుచుకుపోయినట్లుగా వుంటాయి. ఈ వైరస్ తెగులు విత్తనపు దుంపల ద్వారాను, పేనుబంక పురుగుల ద్వారాను వ్యాపిస్తుంది. దీని నివారణకు విత్తనపు దుంపలను తెగులు సోకని తోటల నుండి సేకరించాలి పేనుబంక నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమెటాన్‌లను 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారి చేయాలి.

**దుంప త్రవ్వకం :** పక్వానికి వచ్చిన పైరు ఆకులు పండి నేలపై వాలిపోతాయి. పైరు నాటిన 7-8 నెలలకు పంట త్రవ్వకానికి సిద్ధమవుతుంది. దుంపలను గునపంతో దెబ్బ తగలకుండ జాగ్రత్తగా త్రవ్వి, నీడలో ఆరబెట్టాలి.

**దిగుబడి :** ఎకరాకు ఎర్రనేలల్లో 25-30 టన్నులు, ఒండ్రునేలల్లో 40 టన్నుల దిగుబడిని పొందవచ్చు. కంద సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా 298లో ఇవ్వబడింది.